సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 19 । అక్టోబర్ । 2024



అయోధ్యకు సైకిల్ యాత్ర
ఆంజనేయ స్వామి మాల ధరించిన స్వాములు కాకినాడ నుంచి అయోధ్యకు సైకిల్ యాత్ర చేపట్టారు.
8లో



కరిగిపోయిన కరిసెలబోడు
అక్రమార్కులు మట్టిని లారీల కొద్దీ తరలిస్తుండటంతో గుట్టలు సైతం మాయమవుతున్నాయి.
8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

రామయ్య సేవలో నటుడు సుమన్



ఆలయంలో సుమన్ తదితరులు

ప్రముఖ నటుడు సుమన్ శుక్రవారం శ్రీ సీతారామ చంద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో పూజలు చేశారు. ఉపాలయాలలో పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుమన్ పట్టణంలోని నన్నపనేని మోహన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సందేశం ఇచ్చారు. భద్రాచలంలో పలు ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన తరగతులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టు లైబ్రరీ హాల్‌లో శనివారం నిర్వహించే న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రారంభిస్తారని ఏఐఎల్‌యూ జిల్లా కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఏఐఎల్‌యూ)ఆధ్వర్యంలో నిర్వహించే న్యాయ విజ్ఞాన తరగతులను విజయవంతం చేయాలని సంఘం బాధ్యులు కోరారు. ప్రముఖ న్యాయవాదులు సీవీఎల్ఎన్ మూర్తి, వావిలాల ఆశయ, కొల్లి సత్యనారాయణ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. జిల్లాలోని న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ



గోల్డ్‌మెడల్ సాధించిన శ్రీతేజ

భద్రాచలం: సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో గిరిజన గురుకుల విద్యార్థిని సత్తా చాటింది. ఏపీలోని నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్‌లో 35వ సౌత్ జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో భద్రాచలం గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో సెకండియర్ చదువుతున్న టి.శ్రీతేజ 4,663 పాయింట్స్‌తో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. 100 మీటర్ల హార్డిల్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, జావెలిన్ త్రో తదితర 7 ఈవెంట్స్‌లో పాల్గొని గోల్డ్ మెడల్‌ను సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ ఏ.పద్మావతి, బోధన, బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

పట్టాలెక్కుతున్న రామగుండం



పాతికేళ్లుగా కాగితాలు, ప్రకటనలకే పరిమితమైన మణుగూరు–రామగుండం రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించేందుకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

మణుగూరు–రామగుండం రైల్వే లైన్ పనుల్లో కదలిక
- భూసేకరణకు ప్రత్యేక అధికారుల నియామకం
- రాఘవాపురం వైపు నుంచి పనులు మొదలు
- కోల్ కారిడార్‌పై దృష్టి పెట్టిన రైల్వేశాఖ

రాఘవాపురం నుంచి మొదలు

మణుగూరు–రామగుండం రైల్వేలైన్ నిర్మాణ పనులు ముందుగా రామగుండం వైపు నుంచి మొదలు కానున్నాయి. పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులకు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. అటు నుంచి పనులు మొదలైన తర్వాత ములుగు, భద్రాద్రి జిల్లాల పరిధిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మణుగూరు రైల్వే స్టేషన్ నుంచి మొదలయ్యే ట్రాక్ పట్టణ సరిహద్దులో ఉన్న ఓపెన్‌కాస్ట్ మైన్స్ పక్క నుంచి గోపాలపురం చేరుకుంటుంది. అక్కడి నుంచి జిల్లా సరిహద్దులు దాటుకుని ములుగు, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల మీదుగా రామగుండం సమీపంలోని రాఘవాపురం రైల్వేస్టేషన్ వరకు చేరుకుంటుంది.

బొగ్గు రవాణాకే ప్రాధాన్యం

సింగరేణి సంస్థ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలో బొగ్గు తవ్వకాలు చేపడుతోంది. అయితే ఈ బొగ్గును ఎక్కువ థర్మల్ విద్యుత్ కేంద్రాలకే సరఫరా చేస్తోంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి రామగుండం (పెద్దపల్లి జిల్లా), జైపూర్ (మంచిర్యాల జిల్లా)లు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బొగ్గును సరఫరా చేసేందుకు డోర్నకల్–కాజీపేట–రామగుండం మార్గం ఒక్కటే అందుబాటులో ఉంది. ప్రత్యామ్నాయ మార్గంగా మణుగూరు–రామగుండం లైన్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. దీని ద్వారా భూపాలపల్లికి రైలు మార్గం అందుబాటులోకి రాబోతోంది.

207 కి.మీ నిడివితో సింగిల్ లైన్...

రాఘవాపురం నుంచి రామగుండం వరకు మొత్తం 207 కి.మీ నిడివితో సింగిల్ లైన్‌గా నిర్మాణ పనులు చేపట్టనున్నారు. సుమారు మూడు వేల కోట్లకు పైగా వ్యయం కానుంది. మార్గమధ్యలో గోపాలపురం, తాడ్వాయి, మేడారం, భూపాలపల్లి, కాటారం, మంథనిలో స్టేషన్లు నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా కొత్తగా ప్రతీ పది కిలోమీటర్లకు ఒక క్రాసింగ్ స్టేషన్ కూడా రానుంది. మొత్తం రామగుండం–మణుగూరు మధ్యలో పదిహేనుకు పైగా స్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం మణుగూరు నుంచి రామగుండం వరకు 280 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ కొత్త మార్గం అందుబాటులోకి వస్తే ఈ రెండు స్టేషన్ల మధ్య 70 కి.మీ దూరం తగ్గుతుంది. వేగంగా గమ్యస్థానం చేరుకునే వీలు చిక్కుతుంది.

నెరవేరనున్న పాతికేళ్ల కల

రామగుండం నుంచి మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మించాలనే ప్రతిపాదన తొలిసారిగా 1999లో తెర మీదకు వచ్చింది. అప్పటి నుంచి సర్వేలకే పరిమితమైంది. తొలిసారిగా 2013–14 రైల్వే బడ్జెట్‌లో ఈ లైను నిర్మాణానికి పచ్చ జెండా ఊపారు కానీ నిధులు కేటాయించలేదు. దీంతో గడిచిన పదేళ్లుగా నిర్మాణ పనుల్లో వేగం లేదు. కేవలం లైను నిర్మించే మార్గంలో భూసామర్థ్య పరీక్షలతోనే సరిపెట్టారు. పారిశ్రామిక రంగంలో బొగ్గు రవాణాకు పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గతేడాది ఈ లైను నిర్మాణంపై రైల్వే శాఖ దృష్టి పెట్టింది. ప్రత్యేక ప్రాజెక్ట్‌గా చేపడుతూ ఫైనల్ లోకేషన్ సర్వేకు ఆమోదం తెలిపింది. ఈ ఏడాది మే 23న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటన వచ్చింది. ఆ తర్వాత ప్రక్రియలో భాగంగా భూసేకరణకు రంగం సిద్ధమవుతోంది.

అంతర్జాతీయస్థాయికి ఎదగాలి



విలువిద్య పోటీలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

- ప్రతిభ చూపిన విద్యార్థుల పాఠశాలల అభివృద్ధికి రూ.50 వేలు
- గిరిజన పాఠశాలల జోనల్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో పీఓ రాహుల్



కబడ్డీ ఆడుతున్న బాలికలు

పాల్వంచరూరల్: గిరిజన పాఠశాలల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జోనల్‌స్థాయి గిరిజన పాఠశాలల క్రీడాపోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడా బంధాన్ని స్వీకరించి క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ జోనల్‌స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల పాఠశాలలకు ప్రోత్సాహకరంగా రూ.50 వేలు కేటాయిస్తామన్నారు. బాలబాలికలు ఇష్టమైన క్రీడపై దృష్టి సారించి నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. గిరిజన విద్యాసంస్థలోని విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని వెలికి తీసేందుకు ప్రతి ఆదివారం వినూత్న కార్యక్రమాలు చేపడతామన్నారు. మొదటి రోజు బాలికల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, చదరంగం, ఆర్చరీ, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. శనివారం బాలుర విభాగంలో పోటీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 70 పాఠశాలల నుంచి సుమారు 800 మంది బాలబాలికలు క్రీడా పోటీలకు తరలివచ్చారని నిర్వాహకులు తెలిపారు. కాగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న క్రమంలో ఓ విద్యార్థిని తన కాళ్లు మొక్కుతుండగా, పీఓ నిలువరించారు. ఐటీడీఏ డీడీ.మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు జహీరుద్దీన్, అశోక్‌కుమార్, రాధమ్మ, చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాల్‌రావు, కిన్నెరసాని స్కూల్ హెచ్‌ఎం.రామారావు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఫాసిస్ట్ భావజాలం ప్రమాదకరం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ముదిగొండ: బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్ట్ భావజాలం ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని అమ్మపేటలో శుక్రవారం జరిగిన మండల 9వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలపై రాజ్య హింసను ఎదుర్కొనే క్రమంలో హక్కుల కార్యకర్తలు హత్యలు నిర్బంధాలకు గురవుతున్నారని, ప్రొఫెసర్ సాయిబాబా మరణం సహజమైంది కాదని, అది ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. మతం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను రెచ్చగొట్టడం, విద్వేషాలను సృష్టించడం, పుట్టుకతో వచ్చిన విద్య అని, అధికార సుస్థిరం చేసుకునేందుకు మత రాజకీయాలనే లక్ష్యంగా పెట్టుకుని పాలిస్తోందని దుయ్యబట్టారు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, మూసీ నది ప్రక్షాళన పేరుతో మరో కొత్త రకం డ్రామా తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. కాగా, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌కే సైదులు పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, చింతలచెరువు కోటేశ్వరరావు, బండి పద్మ, వాసిరెడ్డి వరప్రసాద్, బట్టు పురుషోత్తం, వల్లబి రవికిరణ్, నంబూరి బాబు, ఇరుకు నాగేశ్వరరావు, టీఎస్ కల్యాణ్, వేల్పుల భద్రయ్య, రాయల శ్రీనివాసరావు, కోలేటి ఉపేందర్, కందిమళ్ల తిరుపతి, మందరపు వెంకయ్య, పద్మ, మరికంటి వెంకన్న, పండ్ర కోల రాంబాబు, చింతకాయల రామారావు పాల్గొన్నారు. కాగా, సభలో సీపీఎం మండల కార్యదర్శిగా భట్టు పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తెలంగాణ కార్నివాల్ లోగో ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సెలబ్రిటీ సొసైటీ ఆధ్వర్యంలో నవంబర్ 15, 16 తేదీల్లో కొత్తగూడెంలో నిర్వహించనున్న తెలంగాణ కార్నివాల్ లోగోను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలు, లలిత కళలు, హస్తకళలు, పండుగలు, వంటకాలు, సమాచారం, సంప్రదాయాలు అన్నీ ఒకే ప్రాంగణంలో కనిపించేలా తెలంగాణ కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సింగరేణి రిటైర్డ్ జనరల్ మేనేజర్ అందెల ఆనందరావు, సభ్యులు మద్దెల శివకుమార్, అల్లి శంకర్, తాండూరు ధన్‌రాజ్, బండి శుభాకర్, ఆళ్ల రాఘవ, జి శశికళ, కొచ్చెల కమలారాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుతో అధిక ఆదాయం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పక్కన అదనపు కలెక్టర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మునగ సాగు చేస్తే ఎకరానికి రూ. లక్ష వరకు ఆదాయం ఆర్జించవచ్చని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. జిల్లాలోని నర్సరీలు, మొరింగా ప్లాంటేషన్, అజోల్ల పెంపకం, కెనాల్‌బండ్ ప్లాంటేషన్, చేపల పెంపకం, పుట్టగొడుగుల పెంపకంపై శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందనలతో కలిసి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, ఈసీఎస్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులు వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తే ఎకరానికి రూ. 30 వేల వరకే ఆదాయం లభిస్తుందని అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మునగ సాగు చేపడితే ఆదాయం పెరుగుతుందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మొదటి విడతగా జిల్లాలో పది వేల ఎకరాల్లో మునగ సాగు చేపట్టేలా చూడాలన్నారు. ఈ నెలాఖరు వరకు సాగుకు అంగీకరించిన రైతులు, భూమి విస్తీర్ణం, నీటి లభ్యత తదితర వివరాలు నమోదు చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖ పరిధిలోని ఖాళీ స్థలాల్లో, కాల్వలకు ఇరువైపులా వెదురు, జామాయిల్, సుబాబుల్ మొక్కలు నాటాలని అన్నారు. జిల్లాలో పుట్టగొడుగుల పెంపకం, చేపల పెంపకం అధిక సంఖ్యలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిలభ్యత ఉంటే అజోల్లా సాగు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ చంద్రమౌళి, అదనపు డీఆర్‌డీఓ ఎన్.రవి, డీఏఓ బాబూరావు, జిల్లా పరిశ్రమల అధికారి పృథ్వీ, శ్రీనిధి ఆర్‌ఎం శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

70 గజాల్లో ఇల్లు ఎలా కట్టుకోవాలి?

- భూ నిర్వాసితుల ఆవేదన
- భద్రాచలం రామాలయ అభివృద్ధికి స్థల సేకరణ..
- పంచాయతీ ఆధ్వర్యంలో పీసా గ్రామసభ నిర్వహణ
- హాజరైన ఐటీడీఏ పీఓ రాహుల్, అధికారులు



మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్ రావు, వేదికపై పీఓ రాహుల్, ఈఓ రమాదేవి తదితరులు

భద్రాచలంఅర్బన్: 'శ్రీసీతారామ చంద్రస్వామివారి ఆలయ అభివృద్ధికి మేము గతంలో కూడా స్థలాలు ఇచ్చాం. అప్పుడు ఇస్తామన్న పరిహారం ఇప్పటివరకు అందలేదు. రాముడంటే అందరికీ ఇష్టమే. అలా అని మా స్థలాలు ప్రభుత్వానికి ఇచ్చి రోడ్డున పడలేం.' అని నిర్వాసిత ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రామాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60.40 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో అభివృద్ధి పనులకు ఆలయ పరిసర ప్రాంతాల్లోని స్థలాలు సేకరించాల్సిఉంది. ఇందుకోసం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం భూసేకరణ కోసం భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పీసా గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచలం ఐటీడీఏ పీఓ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి రాహుల్ హాజరయ్యారు. తొలుత గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భూసేకరణ నిమిత్తం పీసా గ్రామసభను నిర్వహిస్తున్నామని, అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. దీంతో సభలో పాల్గొన్న పలువురు ప్రజలు మాట్లాడుతూ గతంలో పలు ప్రాంతాలను ఖాళీ చేయించిన అధికారులు, అక్కడివారికి మూడు సెంట్ల చొప్పున స్థలం ఇచ్చారని, ఇప్పుడు తమకు 70 గజాలు మాత్రమే ఇస్తామంటున్నారని వాపోయారు. ఆ స్థలంలో ఇళ్లు ఎలా నిర్మించుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వం పరిహారం పెంచి ఇవ్వాలని, లేకపోతే ఆలయ అభివృద్ధికి భూములు ఇస్తున్న 42 కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు.

చిరువ్యాపారులకు న్యాయం చేయాలి

భద్రాచలం బీఆర్ఎస్ నాయకుడు ఆకోజు సునీల్ మాట్లాడుతూ బొమ్మల దుకాణాలతో జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులకు న్యాయం చేయాలని, వారికి ప్రత్యేకంగా కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గడిచిన పదేళ్లుగా భద్రాద్రి రామాలయం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో ఆలయ అభివృద్ధికి ముందడుగు పడిందన్నారు. దాదాపు రూ.400 కోట్లు వరకు విడుదల అయ్యే అవకాశం ఉందని, భూసేకరణ తర్వాత నిర్వాసితులకు తగిన న్యాయం చేసేలా అందరం కలిసి పనిచేద్దామని అన్నారు. ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ నిర్వాసితుల కోసం నిర్మించే కాంప్లెక్స్ ఆదివాసీలకు కూడా ఇవ్వాలని, ట్రైబల్ మ్యూజియాన్ని నిర్మించాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ గుండు శరత్ మాట్లాడుతూ ఏటా ముక్కోటి ఏకాదశి, శ్రీరామ నవమి వేడుకల సమయంలో తలెత్తుతున్న వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

న్యాయం చేస్తాం : ఆర్డీఓ

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తామని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు అన్నారు. ఇప్పటికే వారితో చర్చలు జరిపి, నష్టపరిహారం వివరాలు వెల్లడించామని తెలిపారు. సభలో పలువురు లేవనెత్తిన సమస్యలను, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. ఆలయ అభివృద్ధికి పీసా గ్రామసభ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, డీఎల్‌పీఓ సుధీర్, ఆర్‌ఐ నరసింహారావు, ఇతర శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

'దిశ' నిర్దేశం చేసేనా..?

- కేంద్ర పథకాల అమలుపై పర్యవేక్షణ కరువు
- జిల్లాలో పలు అభివృద్ధి పనులపై ప్రభావం
- ప్రతిసారీ మొక్కుబడిగానే సమీక్ష సమావేశం
- నేడు జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ భేటీ



దిశ సమావేశంలో ప్రజాప్రతినిధులు,అధికారులు(ఫైల్)

చుంచుపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల దరి చేరడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు జిల్లాకు నిధులను రాబట్టడంలోనూ విఫలమవుతున్నారనే విమర్శలొస్తున్నాయి. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో సంక్షేమ పథకాల లక్ష్యం నెరవేరడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపంతో కొన్ని పనుల ప్రతిపాదనలు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. సుమారు 20 కేంద్ర సంక్షేమ పథకాలు, 40కు పైగా అంశాలను జిల్లాస్థాయిలో సమీక్షించి గ్రామస్థాయిలో అమలు చేసేలా దిశా నిర్దేశం చేయాల్సిన జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశాలు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. కాగా శనివారం దిశ సమావేశాన్ని డీఆర్డీఏ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం తొలిసారిగా మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడు పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుండగా, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై చర్చించనున్నారు. నిబంధనల ప్రకారం ఆరు నెలలకోసారి దిశ సమావేశం నిర్వహించాల్సి ఉంది. కానీ ఏనాడూ సకాలంలో నిర్వహించలేదు. జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వీలు దొరికినప్పుడు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి.

నిర్మాణాత్మక చర్చతోనే ప్రజలకు మేలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలపై ప్రజలకు అవగాహన లేదు. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ జ్యోతియోజన కార్యక్రమం, ఉజ్వల యోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, జాతీయ సామాజిక భద్రత పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి ఉజ్వల యోజన గ్యాస్ పథకం, దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, శ్యాం ప్రసాద్ ముఖర్జీ అర్బన్ మిషన్, ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన తదితర పథకాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన లేదు. ఇప్పటివరకు పలు దిశ కమిటీ సమావేశాలను ఎజెండా అంశాలపై పూర్తిగా చర్చించకుండానే ముగించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కేంద్ర పథకాల్లో సర్వశిక్షా అభియాన్, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ ఉపాధిహామీ పథకం, ఫసల్ బీమా యోజన, స్వచ్ఛ భారత్ మిషన్ పథకాలను జిల్లా వ్యాప్తంగా మరింత పటిష్టంగా అమలుపరచాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పలు విద్యాసంస్థలను జిల్లాలో స్థాపించేందుకు అనువైన పరిస్థితులు, వనరులు, ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. నేడు జరిగే సమావేశంలోనైనా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల్లో లోటుపాట్లపై నిర్మాణాత్మక చర్చ జరపాలని, జిల్లా అభివృద్ధికి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని పలువురు కోరుతున్నారు.

పథకాల అమలుపై చర్చించాలి



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. దిశ కమిటీ సమావేశం మొక్కుబడిగా నిర్వహించకుండా జిల్లాలో అభివృద్ధి పథకాలపై చర్చించాలి. తగిన కార్యాచరణ చేపట్టాలి. అప్పుడే అవి ప్రజలకు చేరువ అవుతాయి. నేడు జరిగే సమావేశంలోనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

–యెర్రా కామేష్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సమావేశానికి ఏర్పాట్లు పూర్తి



జిల్లా అభివృద్ధి, సమన్వయ (దిశ) సమావేశం కలెక్టరేట్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, దిశ కమిటీ సభ్యులు పాల్గొంటారు. వివిధ శాఖల అధికారులు నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలి.

–జితేష్ వి.పాటిల్, కలెక్టర్

క్లుప్తంగా

ఆటలెలా ఆడాలో..?



పిచ్చి మొక్కలతో నిండిన క్రీడా ప్రాంగణం

అశ్వారావుపేటరూరల్: గత ప్రభుత్వ హయం లో ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే వారు లేక పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారుతున్నాయి. అశ్వారావుపేట మండలంలోని మద్దికొండ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం అందుకు నిదర్శనం. కనీస నిర్వహణ లేకపోవడంతో క్రీడా పరికరాలు వృథాగా మారగా, ప్రాంగణం అంతా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి క్రీడా ప్రాంగణాలను శుభ్రం చేయించి, ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

భారీ కొండచిలువ పట్టివేత



స్నేక్ టీం పట్టుకున్న కొండచిలువ

చుంచుపల్లి: చుంచుపల్లి పోలీస్ స్టేషన్ వెనక భాగంలోని సుబ్బయ్యకాలనీలో శుక్రవారం సాయంత్రం 5.6 అడుగుల భారీ కొండ చిలువ ప్రత్యక్షమవ్వడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్నేక్ టీమ్‌కు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకొని కొండ చిలువను పట్టుకున్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయం



చెక్కు అందిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి నీట్‌లో ఆల్ ఇండియా ర్యాంకు ద్వారా ఎంబీబీఎస్ సీటు సాధించటం అభినందనీయమని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. దుమ్ముగూడెం మండలం చిన్నఆర్లగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి హర్షిత ఆలిండియాలో 2,63,943 ర్యాంకు, ఎస్టీ కోటలో 567 ర్యాంకు సాధించి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్‌ను సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పీఓ తన చాంబర్‌లో ఆమెను అభినందించి ప్రోత్సాహకంగా ఐటీడీఏ తరఫున రూ.50 వేలు అందించారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్, బాలిక తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో ట్రెయినీ ఎఫ్‌బీఓలు



అవగాహన కల్పిస్తున్న వైల్డ్‌లైఫ్ అధికారులు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని డీర్ పార్కును శుక్రవారం హైదరాబాద్‌లోని దూలపేట ఫారెస్ట్ అకాడమీకి చెందిన 35వ బ్యాచ్ ట్రెయినీ ఎఫ్‌బీఓలు 60 మంది సందర్శించారు. ఈ సందర్భంగా వైల్డ్‌లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీర్ పార్కులోని దుప్పుల సంరక్షణ, అటవీ వృక్ష సంపద పరిరక్షణపై వైల్డ్ లైఫ్ ఎఫ్‌డీఓ బాబు, రేంజర్లు ఎఫ్‌బీఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ ఉత్సవాలు

చర్ల: సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20 వరకు మావోయిస్టు పార్టీ 20వ ఆవిర్భావ ఉత్సవాలను దండకారణ్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వీడియోను మావోయిస్టులు విడుదల చేయగా అది ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ మీడియా గ్రూపుల్లో వైరల్‌గా మారింది. వీడియోలో మావోయిస్టులు 20 ఏళ్ల కాలంలో పార్టీలో పనిచేసి అమరులైన వారిని స్మరిస్తూ వారి ఫొటోలను ప్రదర్శిస్తూ ఆట పాటలతో ఆదివాసీలను చైతన్య పరిచినట్లుగా తెలుస్తోంది. ఈ ఉత్సవాలకు వేలాదిగా ఆదివాసీలు రాగా, వందల సంఖ్యలో సాయుధులైన మావోయిస్టులు హాజరైనట్లు తెలుస్తోంది.

టేకు కలప స్వాధీనం

గుండాల: అక్రమంగా టేకు కలప నరికి తరలించేందుకు సిద్ధమవుతుండగా కాచనపల్లి రేంజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సెక్షన్ ఆఫీసర్ వెంకన్న కథనం ప్రకారం.. కాచనపల్లి రేంజ్ బోడయికుంట బీట్ పరిధిలో టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికారు. సైజులుగా కోసి తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. సందర్శనకు వెళ్లన క్రమంలో కలపను గుర్తించామని, కలపను స్వాధీనం చేసుకుని ఇల్లెందు డిపోకు తరలించామని వెంకన్న తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.


కరిగిపోయిన కరిసెలబోడు

యానంబైల్ సమీపంలో గుట్టను తవ్వేస్తున్న అక్రమార్కులు

- ఇప్పటికే కనుమరుగైన పాండురంగాపురం వేల్పుల గుట్ట
- రాత్రి వేళ లారీల కొద్దీ తరలింపు, ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని రెవెన్యూ, వైల్డ్‌లైఫ్, మైనింగ్ శాఖల అధికారులు

గుట్టలు కరిగిపోతున్నాయి. బోడులు మాయమవుతున్నాయి. లారీల కొద్దీ మట్టి, ఇసుక తరలిపోతోంది. ఒకవైపు వృక్షసంపదను పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే మరోవైపు అక్రమార్కులు గుట్టలను తవ్వేస్తున్నారు. దీంతో వనాలు తగ్గిపోయి పర్యావరణం దెబ్బతింటోంది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు.

– పాల్వంచరూరల్





యానంబైల్ గ్రామశివారులో సగం తవ్వేసిన కరిసెలబోడు గుట్ట, (ఇన్‌సెట్) రాత్రివేళ జేసీబీ సహాయంతో లారీల్లో నింపుతున్న మట్టి

దసరా ముందు నుంచి రవాణా..

మండల కేంద్రమైన పాల్వంచ, సమీప పట్టణాల్లో గృహనిర్మాణాలు, రహదారుల నిర్మాణ అవసరాలకు మట్టి, ఇసుకకు డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా పలువురు రాత్రి వేళ్లలో గుట్టుగా తరలిస్తున్నారు. వాగులు పాతాళ గంగను తలపిస్తుండగా, గుట్టలు కరిగిపోతున్నాయి. ఇప్పటికే పాల్వంచ మండలంలోని పాండురంగాపురం గ్రామపంచాయతీలో వేల్పుల గుట్ట మట్టిని, రాయిని అక్రమంగా తరలించారు. దీంతో గుట్ట కనుమరుగైంది. తాజాగా యానంబైల్ గ్రామ సమీపంలోని కరిసెల బోడు(గుట్ట) మట్టిని దసరా పండుగ ముందు నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇప్పటికే గుట్ట సగమైంది. అటవీ ప్రాంతంలోని గుట్టలను, వాటిపై ఉన్న చెట్లను సంరక్షించాల్సిన వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పలు సందేహాలకు తావిస్తోంది.

లారీ మట్టికి రూ.8 వేలు..

మండల పరిధిలోని యానంబైల్, రాజాపురం, తోగ్గూడెం ప్రాంతాల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అనుమతులు లేకుండానే రాత్రి సమయంలో జేసీబీ యంత్రాల సాయంతో లారీల ద్వారా మట్టిని రవాణా చేస్తున్నారు. యానంబైల్, రాజాపురం గ్రామాల మధ్య కిన్నెరసానిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులకు వినియోగిస్తున్నారు. అక్కడ డంప్ చేసిన మట్టిని కొందరు గృహనిర్మాణాల కోసం పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలకు రవాణాచేస్తున్నారు. చీకటిపడితే చాలు కిన్నెరసాని, తోగ్గూడెం ప్రధాన రహదారుల్లో మట్టి లారీలు, ట్రాక్టర్లు జోరుగా తిరుగుతున్నాయి. ఒక్కో లారీ మట్టిని రూ.6 వేల నుంచి రూ. 8 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

కిన్నెరసాని నుంచి ఇసుక..

మండలంలోని రంగాపురం, నాగారం గ్రామాల సమీపంలో ఉన్న కిన్నెరసాని వాగు నుంచి రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రహస్య ప్రదేశాలకు డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు గుట్టుగా తరలిస్తున్నారు. మరికొందరు మట్టిని నిర్దేశించుకున్న ప్రాంతాల్లో నిల్వచేసి తర్వాత డిమాండ్‌ను బట్టి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.



అక్రమంగా తరలించి కిన్నెరసాని బ్రిడ్జి వద్ద పోసిన మట్టి

మైనింగ్, రెవెన్యూ, అటవీ శాఖ, పోలీస్ అధికారులు ఏం చేస్తున్నారు?

అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరా చేసుకుని రూ.లక్షల విలువైన మట్టి, ఇసుకను తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నా, అధికారులు స్పందించడంలేదు. మట్టి వ్యాపారం అధికారులకు కూడా కాసుల వర్షం కురిపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మట్టిని, ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీసు, ఫారెస్ట్(వైల్డ్‌లైఫ్) శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు



అనుమతులు లేకుండా మట్టి, మొరం, ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం. పట్టా భూముల యజమానులు కూడా మట్టిని తరలించుకోవాలంటే అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. యానంబైల్, తోగ్గూడెం గ్రామాల పరిధిలో మట్టి తరలింపునకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. లారీల ద్వారా రాత్రి సమయంలో మట్టి, ఇసుక తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటున్నాం.

–వివేక్, పాల్వంచ తహసీల్దార్

స్వయం ఉపాధితో ఎదగండి..



మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: నిరుద్యోగ గిరిజన యువత ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ఆకాంక్షించారు. శుక్రవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు వివిధ స్వయం ఉపాధి పథకాలపై నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐటీడీఏ భవిత సెల్ ద్వారా నిర్వహించే వివిధ రకాల వృత్తి శిక్షణ ద్వారా జీవనోపాధి పొందవచ్చని చెప్పారు. అనంతరం జేడీఎం హరికృష్ణ మాట్లాడుతూ.. టైలరింగ్ శిక్షణకు 65 మంది, మష్రూమ్ కల్టివేషన్ శిక్షణకు 10 మంది దరఖాస్తు చేసుకోగా వారికి రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా వైటీసీలో 30 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. తేనెటీగల పెంపకానికి దరఖాస్తు చేసుకున్న 23 మందికి కొత్తగూడెం కేవీకే ద్వారా భద్రాచలంలో పది రోజులు శిక్షణ ఉంటుందని చెప్పారు. బ్యూటీషియన్ శిక్షణకు 16 మంది, ఎలక్ట్రీషియన్ శిక్షణకు 9 మంది దరఖాస్తు చేసుకోగా వారికి బూర్గంపాడులోని ఐటీసీలో నెలరోజుల పాటు శిక్షణ అందిస్తామని వివరించారు.కార్యక్రమంలో అనూష, మణికుమారి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఐటీడీఏ ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాల బాలికలకు మణుగూరు మండలం ముత్యాలమ్మ నగర్‌లోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులో సంవత్సరం కాల కాలపరిమితితో 40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సుకు సంవత్సరం కాల పరిమితితో 40 సీట్లు ఉన్నాయని వివరించారు. ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ కోర్సుకు ఏడాది కాల పరిమితితో 20 సీట్లు, బేసిక్ డిజైనర్ – వర్చువల్ వెరిఫైర్ (మెకానికల్) కోర్సుకు రెండేళ్ల కాల పరిమితితో 24 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంకా అడ్వాన్స్ సీఎస్‌సీ, మిషన్ టెక్నీషియన్ కోర్సుకు రెండేళ్ల కాలపరిమితి తో 24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్స్ కోర్స్‌కు రెండు సంవత్సరాల కాల పరిమితితో 24 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల గిరిజన బాలబాలికలు ఈనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చేసుకుని మణుగూరు ఐటీఐలో హాజరు కావాలని సూచించారు.



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ నగేష్

వేగంగా పూర్తి చేయాలి

మణుగూరు టౌన్: ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధి, శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేష్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ ఐటీఐలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏటీసీలోని ఆరు కోర్సుల్లో ఇప్పటివరకు జరిగిన ప్రవేశ వివరాలపై ఆరా తీశారు. మిగిలిన సీట్లు త్వరలో భర్తీ చేయాలన్నారు. ఏటీసీ భవన నిర్మాణ పనులను సైతం పర్యవేక్షించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్, టీఓజీ రవి, సూపరింటెండెంట్ జ్యోతి రాణి, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఇఫ్తార్, ఏటీఓలు శ్రీనివాసరావు, జీవీ కృష్ణారావు, నరసయ్య, వేణుగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

అయోధ్యకు మాలధారుల సైకిల్ యాత్ర

గుండాలలో స్వాగతం పలికిన ఆలయ కమిటీ



సైకిల్ యాత్రగా గుండాల నుంచి బయలుదేరుతున్న స్వాములు

గుండాల: ఆంజనేయ స్వామి మాల ధరించి కాకినాడ నుంచి అయోధ్యకు సైకిల్‌యాత్ర చేస్తున్న స్వాములకు గుండాలలో ఘనంగా స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ నుంచి అంజన్న మాల ధరించిన నలుగురు అయోధ్యకు సైకిల్ యాత్ర చేస్తూ గురువారం రాత్రి గుండాలకు చేరుకున్నారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అల్పాహార అందించారు. శుక్రవారం తెల్లవారుజామున వారిని సన్మానించి డప్పు చప్పుళ్లతో సాగనంపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుక్కోవళ్లూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి యాసారపు సురేష్, కోశాధికారి కోడూరి శ్యాం, గౌరవాధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు, సభ్యులు మానాల శ్రావణ్, గుండెబోయిన లక్ష్మినారాయణ, తాడోజు సురేష్, యాసారపు రవి, బొబ్బిలి నాగేష్, గడ్డం సాయి, చెన్నూరి రాంబాబు, మానాల సతీష్, మాచర్ల రంజిత్, తాటిపల్లి సత్యం, శ్రీరాం, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదోమ ఉధృతిపై దృష్టిపెట్టాలి

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవికుమార్, శాస్త్రవేత్త ఫణిశ్రీ

కారేపల్లి: పత్తి పంటలో పచ్చ దోమ ఉధృతి అధికంగా ఉందని, ఎక్కువ వర్షపాతం, తక్కువ ఉష్ణోగ్రతలు, వాతావరణం మేఘావృతం కావడంతో పత్తి పంటలో పచ్చదోమ ఉధృతి అధికంగా ఉందని, రైతులు తక్షణమే సస్యరక్షణ చర్యలపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు పీఎస్ఎం ఫణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండలంలోని గేటురేలకాయలపల్లి గ్రామంలో పత్తి, మిరప పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు.

పత్తి పంటలో పచ్చదోమ

- పచ్చదోమ సాధారణంగా అధిక వర్షపాతం, వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉంటే వృద్ధి చెందుతుంది.
- పిల్ల, తల్లి పురుగులు, ఆకుల అడుగు భాగానికి చేరి రసాన్ని పీలుస్తాయి. దీంతో ఆకులు మొదట దొనెలుగా ముడుచుకొని, లేత పసుపు రంగులోకి మారి తరువాత ఆకుల అంచుల నుంచి ఎర్రబడి క్రమంగా ఎండిపోతాయి. దీంతో మొక్క ఎదుగుదల కుంటుపడిపోతుంది.
- సస్యరక్షణలో భాగంగా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా డైఫెన్ థయూరాన్ 1.25 గ్రా. లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారీ చేయాలి.
- జీవ రసాయనాలైన 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె (1500 పీపీఎం) 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మిరప పంటలో పొగాకు లద్దెపురుగు

- పొగాకు లద్దెపురుగు లార్వాలు ఆకులకు చిన్న చిన్న రంధ్రాలు చేసి ఆకులను జల్లెడగా మారుస్తాయి.
- కాపు దశలో మిరప కాయలను ఆశించి ముచ్చిక వద్ద రంధ్రం చేసి శరీర భాగమంత కాయలోపలికి జొప్పించి గింజలను, గుజ్జును తింటాయి.
- పొగాగు లద్దె పురుగుకు ఎదిగిన లార్వాలను విషపు ఎరను ఉపయోగించి నివారించుకోవాలి. 5 కిలోల తవుడు, 500 మి.లీ. క్లోరిపైరిఫాస్, 500గ్రా. బెల్లం తగినంత నీటికి కలిపి చిన్న చిన్న గుళికలు తయారు చేసి పొలంలో సమానంగా చల్లాలి.
- ఎకరానికి 4 లింగకార్షక బుట్టలు అమర్చుకోవాలి
- నివారణకు థయోడికార్బ్ 1 గ్రా. లేదా నొవాల్యురాన్ 0.75 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సకార్బ్ 0.8 మి.లీ. లేదా ఇమమెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వైరా డివిజన్ ఏడీఏ టి.కరుణశ్రీ, మండల వ్యవసాయాధికారి బి.అశోక్‌కుమార్, ఏఈఓ బి.నరేశ్, రైతులు పాల్గొన్నారు.

బైక్ పల్టీ : వ్యక్తికి తీవ్రగాయాలు

కామేపల్లి: బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పొన్నేకల్ గ్రామానికి కూరాకుల కోటేశ్వరరావు పని నిమిత్తం ఖమ్మం వెళ్లి తిరిగి బైక్‌పై పండితాపురం స్టేజీ వైపు వెళ్తున్నాడు. పండితాపురం సంత సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ ఎదురుగా బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గోదావరిలో మునిగిన వారిని రక్షించిన ఫొటోగ్రాఫర్



చిన్నారులను ఒడ్డుకు చేర్చిన ఫొటోగ్రాఫర్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం రాముడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు.. గోదావరిలో స్నానం చేస్తూ మునిగిపోతుండగా ఓ ఫొటోగ్రాఫర్ రక్షించాడు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఇల్లెందుకు చెందిన కుటుంబం శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకోవడానికి వచ్చారు. గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లగా మహిళతో పాటు ముగ్గురు చిన్నారులు గోదావరిలో మునుగుతుండగా అక్కడే ఫొటోగ్రాఫర్ గమనించి వారిని రక్షించాడు. ఈ క్రమంలో సదరు ఫొటోగ్రాఫర్ కెమెరా నీటిలో మునిగిపోయింది.

ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన బూరం వెంకటేశ్వర్లుకు చెందిన ఇల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఉదయం ఇంట్లో దీపారాధన చేసిన అనంతరం అందరూ పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి మంటలు వ్యాపించడంతో చుట్టు పక్కల ప్రజలు మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఇంట్లోని వస్తువులు స్వల్పంగా కాలిపోగా సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిలినట్టు బాధితులు చెప్పారు.

వీధికుక్క హల్‌చల్



గాయపడిన భార్గవ్

దమ్మపేట: ఇంటి ముందు ఆడుకుంటున్న పిల్లోడిని వీధి కుక్క కరిచిన ఘటన మండలకేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. అర్బన్‌కాలనీకి చెందిన భార్గవ్ (5) ఇంటి ముందు ఆడుకుంటుండగా అకస్మాత్తుగా అలువైపు వచ్చిన వీధి కుక్క దాడి చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే కుక్కని బెదరగొట్టి బాబును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి తరలించారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

పినపాక: కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని పాండురంగాపురం జీపీ బీసువారిగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీసువారిగూడెంలో పలువురు కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 8 బైక్‌లు, రూ.3,500 నగదు, రెండు కోళ్ల స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

స్కూల్‌లోకి దూసుకెళ్లిన లారీ



స్కూల్ ఆవరణలో బోల్తా పడిన లారీ

చండ్రుగొండ: స్కూల్‌లోకి లారీ దూసుకెళ్లిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని మద్దుకూరు మూలమలుపు వద్ద గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి వీఎం బంజర్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీ దూసుకుపోయింది. లారీ అతివేగంగా రావడంతో మలుపు వద్ద అదుపుతప్పి స్కూల్‌లోకి వెళ్లి బోల్తాపడింది. విద్యార్థులు ఇళ్లకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. లారీడ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీడ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.


ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం..

సత్తుపల్లి డిపోలో ఒక్కరోజే రూ.33.58లక్షలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపో రికార్డు స్థాయి ఆదాయం ఆర్జించింది. డిపో చరిత్రలోనే ఈ నెల 17న రికార్డు స్థాయిలో రూ.33,58,658 ఆదాయం వచ్చింది. రోజువారీగా సుమారు రూ.20 లక్షల ఆదాయం నమోదయ్యేది. కానీ దసరా పండుగ ముగిసిన తర్వాత ప్రయాణికులు తిరిగి వెళ్తుండడంతో ఒక్క రోజులోనే అత్యధిక ఈపీకే(కిలోమీటర్‌కు ఆదాయం) 69.68 శాతం, ఆక్యుపెన్సీ రేషియో 109శాతం సాధించింది. అత్యధికంగా 47,768 కిలోమీటర్ల మేర డిపో బస్సులు తిరగడం ద్వారా ఈ ఆదాయం లభించింది. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 1 నుంచి 16వ తేదీ వరకు షెడ్యూల్ బస్సులు కాకుండా అదనంగా 190 స్పెషల్ సర్వీస్‌లు నడపటం ద్వారా రూ.80,83,781 ఆదాయం లభించగా 101 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించింది. కాగా, ఉద్యోగులు, కండక్టర్లు, డ్రైవర్ల సమష్టి కృషితోనే అత్యధిక ఆదాయం లభించిందని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అన్నారు. దసరా సందర్భంగా ఉద్యోగులు అంకిత భావంతో పని చేయడంతో పాటు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించటంతో ఆర్టీసీ బస్సులకు ఆదరణ లభించిందని, డిపో చరిత్రలోనే అత్యధిక ఆదాయం సాధించటం ఆనందంగా ఉందన్నారు.

యువకుడిపై ఇనుప రాడ్లతో దాడి

ఏడుగురిపై కేసు నమోదు



తీవ్రంగా గాయపడిన సుదర్శన్

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీ జగదాంబ గుంపులో రాఘబోయిన గూడెం గ్రామానికి చెందిన నిట్ట సుదర్శన్‌పై నలుగురు యువకులు ఇనుపరాడ్లతో దాడికి దిగారు. పోలీసుల కథనం ప్రకారం.. రాఘబోయినగూడెం నుంచి ఖమ్మం వెళ్లేందుకు బైక్‌పై సుభాష్‌నగర్ కూడలి వద్దకు అర్ధ రాత్రి వేళ సుదర్శన్ చేరుకున్నాడు. తన సోదరుడు రాజేశ్ ఇంటివద్ద బైక్ పెట్టేందుకు జగదాంబగుంపు వద్దకు వచ్చాడు. సుదర్శన్‌ను అనుసరించిన సుభాష్ నగర్‌కు చెందిన వంశీ, ప్రేం, ఉదయ్, యాకూబ్ రాజేశ్ దుకాణం వద్ద ఘర్షణ పడ్డారు. నలుగురు వ్యక్తులు సుదర్శన్‌పై సీసాలు, ఇనుప రాడ్లతో దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన సుదర్శన్‌ను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. సుదర్శన్ ఫిర్యాదు మేరకు వంశీ, ప్రేం, ఉదయ్, యాకూబ్‌తోపాటు ఆముదాల ప్రసాద్, గడ్డం అనిల్, మాలోత్ నాగేశ్వరరావుపై హత్యా యత్నం కేసు నమోదు చేశారు.